www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 17 జూలై 2023
5
ఏలూరు



నేడు యథావిధిగా 'స్పందన'



ప్రజాశక్తి - ఏలూరు
ఏలూరులోని కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 17వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు ధరించి, సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా
చెరువుల అక్రమ తవ్వకాలు..!

జిల్లాలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
దర్జాగా ప్రభుత్వ భూములు కబ్జా
పట్టించుకోని అధికారులు
కోటేశ్వరదుర్గాపురం, కానుకొల్లులో బరితెగింపు
రూ.కోట్ల విలువ చేసే ఐదెకరాలు అన్యాక్రాంతం
'కొండంగి ఎత్తిపోతల' భూములదీ అదే పరిస్థితి
ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని దుస్థితి



మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో ప్రభుత్వ భూమిలో తవ్వుతున్న చేపల చెరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు సలాంకొడుతున్నారు. దీంతో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతిలోకి వెళ్లిపోతున్నాయి. ఏలూరు మండలం కోటేశ్వర దుర్గాపురం, మండవల్లి మండలం కానుకొల్లులో దాదాపు ఐదెకరాల ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జాచేసి చేపల చెరువులుగా మార్చేస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అధికారుల అండదండలతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ఏలూరు జిల్లాలో సాగుతున్న చేపల చెరువుల అక్రమ తవ్వకాలను అధికారులు ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ నాయకులు ఏంచేసినా తమకు ఏమీ సంబంధంలేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. మండవల్లి మండలం కానుకొల్లులో దళితుల నివాసాలకు దాదాపు 11 ఎకరాల్లో అధికార పార్టీకి చెందిన వ్యక్తి చేపల చెరువు తవ్వకం చేపట్టారు. చెరువులో పడమర వైపు 1.68 ఎకరాల ప్రభుత్వ భూమి, తూర్పు వైపు 1.64 ఎకరాలు మిలటరీ భూమి, దక్షిణంవైపు పెద్దఎత్తున పుంత పోరంబోకు భూమి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ చెరువులో దాదాపు ఐదెకరాల వరకూ ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ప్రస్తుతం ఎకరం రూ.40 లక్షల వరకు ఉంది. అంటే దాదాపు రూ.రెండున్నర కోట్లకు పైగా ప్రభుత్వ భూమిని అక్రమించుకుని చేపల చెరువుగా మార్చేస్తున్నారు. ఈ చెరువు తవ్వకం వల్ల తాగునీటి వనరులు కలుషితం కావడమే కాకుండా దాదాపు 200 దళిత కుటుంబాల జీవనం ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ చెరువుతవ్వకం నిలిపివేయాలంటూ స్థానిక ప్రజానీకం పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. చెరువుకు అనుమతులు ఇచ్చేసమయంలో స్థానిక రెవెన్యూ అధికారులు అక్కడ ప్రభుత్వ భూమి ఉందో లేదో కూడా కనీస పరిశీలన చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికార పార్టీనేతలైతే చాలు ఇక నిబంధనలతో పనిలేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. కలిదిండి మండలం కొండంగిలో ఎత్తిపోతల పథకానికి చెందిన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసి చేపల చెరువు తవ్వకం సాగించే దుర్మార్గపు చర్యలు సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

కోటేశ్వర దుర్గాపురంలో సీలింగ్ భూమి కబ్జా

ఏలూరు మండలం కోటేశ్వర దుర్గాపురంలోనూ ప్రభుత్వ సీలింగ్ భూమిని కబ్జా చేసి చేపల చెరువుగా మార్చేస్తున్నప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇక్కడ తవ్వుతున్న ఆరు ఎకరాల చేపల చెరువులో 1.50 ఎకరాలు సీలింగ్ భూమి ఉంది. ఈ చెరువు తవ్వకానికి ఎలాంటి అనుతులూ లేవని స్పష్టంగా తెలుస్తోంది. ఈ అక్రమ చేపల చెరువు తవ్వకంపై స్థానికులు ఫిర్యాదు చేయగా అధికారులు గట్లకు గండ్లు సైతం కొట్టారు. ఇదంతా తూతూమంత్రంగా జరిగినట్లు చూసిన వాళ్లందరికీ అర్థమవుతుంది. ఎందుకంటే ప్రభుత్వ భూమి కబ్జా చేసి చేపల చెరువు తవ్వకం సాగుతుంటే ఆ వ్యక్తిపై కేసు పెట్టి చర్యలు తీసుకోకుండా, చెరువు గట్లకు గండికొండి మమ అనిపించడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. బహిరంగంగానే చేపల చెరువు తవ్వకం జరుగుతున్నా తమ దృష్టికి రాలేదన్నట్లు అధికారులు మాట్లాడుతున్న తీరు హాస్యాస్పందంగా ఉంది. అక్రమార్కులకు అధికారులే కొమ్ముకాస్తున్నారని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ భూములను అక్రమార్కులకు ధారదత్తంగా అధికారులే కట్టబెడుతున్న తీరు అత్యంత దారుణమని చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలోని కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో ఈ విధమైన ఘటనలు అనేకం ఉన్నప్పటికీ కొన్ని మాత్రమే వెలుగుచూస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే బెదిరింపులకు దిగుతున్నారు. ప్రస్తుతం పెద్దఎత్తున భూపోరాటం జరుగుతున్న దెందులూరు మండలం దోసపాడులో గతంలో ఇదేవిధంగా పేదలకు చెందిన సీలింగ్, అసైన్డ్ భూముల్లో అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు చేపట్టారు. నేడు అదేతరహాలో కొల్లేరును ఆనుకుని ఉన్న మండలాల్లోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జాచేసి చేపల చెరువులుగా తవ్వేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ చేపల చెరువులకోసం కబ్జాచేసిన ప్రభుత్వ భూములను కాపాడాలని అంతాకోరుతున్నారు.

ఆక్రమించిన భూమిని పేదలకు పంపిణీ చేయాలి

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులు ఆ భూముల్లో ఆక్రమంగా చేపల చెరువులు తవ్వేస్తున్నా కళ్ళు మూసుకున్నట్లు వ్యవహరించడం దారుణం. ప్రభుత్వ, సీలింగ్ భూముల్లో చేపల చెరువుల తవ్వకాలు చట్టవిరుద్ధం. సిఎం జగన్ అసైన్డ్ భూములను పంపిణీ చేస్తామని చెబుతున్నారు. ముందుగా కబ్జా చేసిన భూములను ఎవరికి పంపిణీ చేస్తారో చెప్పాలి. కబ్జాచేసిన ప్రభుత్వ భూములను అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలి.



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

వేగంగా రెవెన్యూ అతిథి గృహ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - ఏలూరు
రెవెన్యూ అతిథి గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ రోడ్డు గిరిజన భవన్ పక్కన ఉన్న రెవెన్యూ అతిథి గృహం పాత భవనం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను అధికారులతో కలిసి కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అతిథి గృహం చుట్టూ మొక్కలతో గార్డెనింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో ఉండేలా చూడాలని, ఇంటీరియర్ కూడా ఆకర్షణీయంగా ఉండేలా నిర్మాణ పనులు ఉండాలని సూచించారు. నిర్దేశించిన సమయం లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆఫీసర్స్ క్లబ్ సందర్శన

అనంతరం ఆఫీసర్స్ క్లబ్‌ని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సందర్శించారు. క్లబ్‌లో ఏర్పాటు చేసిన జిమ్, వ్యాయామ పరికరాలను పరిశీలించారు. జిల్లా అధికారుల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు క్లబ్‌లో ప్రత్యేక వ్యాయామాలు, ఆధునిక వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశామని, ఆ అవకాశాన్ని వినియోగించుకుని, ప్రతీరోజు వ్యాయాయం చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేలా జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఎఇ రాఘవేణి, తహశీల్దార్ సోమశేఖర్, కాంట్రాక్టర్ రాజు పాల్గొన్నారు.


బెదిరించి, భయపెట్టడం దారుణం

దోసపాడు దళితులకు న్యాయం చేయండి
144, 145 సెక్షన్లు ఎత్తివేయాలి
పేదలను తప్పదోవ పట్టిస్తున్న తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
పేద ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న దెందులూరు తహశీల్దారుపై వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం దోసపాడు భూ పోరాట కమిటీ సమావేశం పి.అనందరావు అధ్యక్షతన దోసపాడులోని కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడులో 144, 145 సెక్షన్లు పెట్టి పేదలను, దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న 72 ఎకరాలు మినహాయించి మిగిలి ఉన్న అసైన్డ్, సీలింగ్ 150 ఎకరాల భూమిని వెంటనే పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పట్టాదారుల పేర్లు, వారి వారసుల పేర్లు ఇచ్చినా ఇవ్వలేదని, మరలా ఇవ్వాలని దెందులూరు తహశీల్దార్ మాట మార్చడం సిగ్గుచేటన్నారు. తహశీల్దార్, ఎస్ఐ, సిఐలు చట్టాలను అమలు చేయకుండా భూస్వాములకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. అసైన్డ్ యాక్ట్ ప్రకారం వ్యవసాయ భూముల్లో చెరువులు తవ్వకూడదని ఉన్నా, అసైన్డ్ సెక్షన్ 24 ప్రకారం చట్ట విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దోసపాడులో మాటిమాటికి 144, 145 సెక్షన్లు విధించి పేదలను, దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. సెక్షన్ 145 ప్రకారం భూముల్లో ఉన్న పంటను స్వాధీనం చేసుకోలేదంటే భూస్వాముల పక్షాన ఉన్నట్టే అర్థమవుతుందన్నారు. సెక్షన్ 20ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేస్తున్న తహశీల్దార్, ఎస్ఐ, సిఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ కలగజేసుకుని స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు భూస్వాముల మాటలు విని పేదలు, దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల చెరువుల వద్ద ఉన్న భూస్వాముల ఏజెంట్లను, బినామీలను వెంటనే అక్కడి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండేలా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్.జాన్‌రాజ్, నాగేంద్ర, ఏసుమణి, దీవెనమ్మ, మాణిక్యం, భూషణం, లలిత పాల్గొన్నారు.

20 నుంచి మున్సిపల్ కార్మికుల దశలవారీ ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న నేత

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని(ఆప్కాస్) పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ ఆటోల డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ ఈనెల 20వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపట్టాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపును జిల్లాలో జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశం నిర్ణయించింది. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం వినుకొండ రమేష్ అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశం వివరాలను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు పత్రికలకు తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద మహిళా కార్మికులు రిలే నిరాహార దీక్షలు, 21వ తేదీన అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద పురుష కార్మికుల రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ నెల 27వ తేదీన రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్యాలయాలు ముట్టడించాలని, వచ్చేనెల ఏడో తేదీన జిల్లా కలెక్టరేట్లు ముట్టడించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపును జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మున్సిపాలిటీల్లో జయప్రదం చేయాలని సమావేశం నిర్ణయించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15వ తేదీ తర్వాత రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపట్టాలని, దానికి కార్మిక వర్గమంతా సన్నద్ధం కావాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ సిఎం జగన్ 2019 ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని, మున్సిపల్ కార్మికులను నట్టేట ముంచారని విమర్శించారు. రాబోయే ఎన్నికలకు ముందైనా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశంలో నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు కార్పొరేషన్లకు చెందిన యూనియన్ల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ విభాగాల నాయకులు బి.సోమయ్య, కారు దుర్గారావు, వీరంకి సాయిబాబు, బి.ఆంజనేయులు, ఎస్.శివకృష్ణ, కె.నాగరాజు, విజయకుమార్, డి.రాజు, వెంకటేష్, దిలీప్, వెలగాడి పద్మ, ఎం.కమల కుమారి, మధు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్త దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో మున్సిపల్ సిపిఎస్ ఉద్యోగులు, కార్మికులు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) ఉద్యోగులు, క్లాప్ ఆటోల డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. చింతలపూడి మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, హెల్త్ అలవెన్సులు అమలు చేయాలని సమావేశం కోరింది. జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న మూడు నెలల హెల్త్ అలవెన్స్‌లు వెంటనే విడుదల చేయాలని సమావేశం డిమాండ్ చేసింది.

'పోరుకేక పాదయాత్ర' రెడ్‌షర్ట్ వాలంటీర్లకు మెమెంటోలు

ప్రజాశక్తి - కుక్కునూరు



మెమెంటోలతో రెడ్‌షర్ట్ వాలంటీర్లు

పోలవరం పోరుకేక పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేసిన రెడ్‌షర్ట్ వాలంటీర్లకు అభినందన సభ ఆదివారం కారం వెంకట్రావు అధ్యక్షతన వసంతవాడ సుందరయ్య నగర్‌లో ఆదివారం నిర్వహించారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర గతనెల 26 తేదీన మండలంలో రుద్రంకోటకు చేరుకుంది. 15 రోజులపాటు పోలవరం పోరుకేక పాదయాత్ర నెల్లిపాక నుండి విజయవాడ వరకూ జరిగింది. ఈ పాదయాత్రలో వేలేరుపాడు మండలం నుండి పాల్గొన్న 15 మంది వాలంటీర్లకు సిపిఎం జిల్లా నాయకులు మడివి దుర్గారావు, మండల కార్యదర్శి ధర్ముల, రమేష్ కొత్త, వెంకటేశ్వర్లు, మడకం, అక్కమ్మ ద్వారా వాలంటీర్లకు మెమెంటోలు అందజేశారు. పోరుకేక పాదయాత్రలో అనేక సమస్యలు బృందానికి ప్రజలు విన్నవించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ గ్రామ గ్రామాన నిర్వాసితులు పాదయాత్ర బృందానికి నీరాజనాలు పలికారని పాదయాత్రలో పాల్గొన్న వాలంటీర్ల ద్వారా వారి అభిప్రాయాన్ని సభలో వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్ముల రమేష్ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై చేపట్టిన యాత్రలో పాల్గొన్న వారిలో ఎక్కువమంది యువతే అని గుర్తు చేశారు. వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వాలు కట్ అఫ్ డేట్‌లు పెట్టి 18 సంవత్సరాలు నిండిన వారిని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నుండి దూరం చేస్తున్నారని ఆయన విమర్శించారు. గ్రామాల నుంచి తరలించే నాటికి వయస్సును పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకం ఏసుబాబు, కె.ప్రకాష్, పూసం రాంబాబు, పాయం సత్యం, కుంజ కావ్య, భవాని, మౌనిక, జ్యోతి, నాగేంద్రబాబు, నాగు, బాలరాజు పాల్గొన్నారు.

మొక్కల అభివృద్ధే లక్ష్యం



సబ్సిడీపై 7.8 లక్షల మొక్కల సరఫరా
ఏడు చోట్ల నర్సరీలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
పర్యావరణ సమతుల్యతకు అడవులు 70 శాతం మేర ఉండాలనేది ప్రామాణికం. జిల్లాలో మాత్రం అడవులు అంత స్థాయిలో విస్తరించి లేవు. అయితే అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో సామాజిక వనాలు అభివృద్ధి చేయడం తప్పనిసరి పరిస్థితి. రోడ్ల వెంబడి, గృహసముదాయాలు, కాలనీలు, పొలం గట్లు తదితర చోట్ల సామాజిక వనాలు అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే గత ఐదారేళ్లుగా మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కంపా పథకం మినహా మరే పథకానికి నిధులు కేటాయించడం లేదు. దీంతో సామాజిక మొక్కలు నాటే కార్యక్రమం అంతంత మాత్రంగానే సాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో గతానికి భిన్నంగా నామమాత్రపు రుసుముకు పండ్ల మొక్కలను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ నేపథ్యంలో సామాజిక వనాల ఏర్పాటు ప్రక్రియ ఎలా జరుగుతుంది? ప్రజల సహకారం ఎలా ఉంది? ఇత్యాది అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు జిల్లా సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఒ ఎ.హిమశైలజ.

ప్రశ్న : జిల్లాలో సామాజిక వనాల పెంపు కార్యక్రమం ఎలా సాగుతోంది?
జిల్లాలో అడవుల పెంపు కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. టెరిటోరియల్, సోషల్ ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ విభాగాల ద్వారా అవసరమైన ప్రాంతాల్లో మొక్కలు నాటడం, అడవులు పెంచడానికి కృషి చేస్తోంది. సామాజిక వన విభాగం పరిధిలో గతంలో అనేక కార్యక్రమాల ద్వారా మొక్కలు నాటాము. నరేగా, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా మొక్కలు నాటడం, పెంచడం జరిగేది. ఈ ఏడాది కేవలం కంపా పథకం ద్వారా మాత్రమే నర్సరీల్లో మొక్కలు ఉత్పత్తి చేసి, ప్రజలకు అందిస్తున్నాం.

ప్రశ్న : ఈ ఏడాది ఎన్ని లక్షల మొక్కలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?
జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రజలకు 7.8 లక్షల మొక్కలు అందించాలని లక్ష్యం పెట్టుకున్నాం. సిద్ధం చేశాము. వీటిలో నిమ్మ, దానిమ్మ, మామిడి, వేప, ఉసిరి వంటి మొక్క జాతులున్నాయి.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి?
జిల్లాలో ఏడు చోట్ల అంటే శనివారపుపేట, మద్దిగూడెం, బుట్టాయగూడెం, తడికలపూడి, పి.పురం, నామవరం, వెంకటాపురం గూడెం, బత్తుల వారిగూడెం నర్సరీల్లో మొక్కలు పెంచాం. మొత్తం పది నర్సరీలు ఉండగా, కంపాస్ పథకంలో విడుదలైన నిధులు, కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కమిటీ నిర్ణయం మేరకు 7.8 లక్షల మొక్కలను ఏడు నర్సరీల్లో పెంచాం.

ప్రశ్న : మొక్కలు ఎవరెవరికి అందిస్తారు?
మొక్కలు ఎవరైనా తీసుకోవచ్చు.



అయితే కంపాస్ పథకంలో సబ్సిడీపై మాత్రమే మొక్కలు ఇస్తాము. ఒక్కో టేకు మొక్క రూ.ఐదు చొప్పున, ఇతర మొక్కలు రూ.రెండు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఆధార్ కార్డు నకలు తెచ్చి మొక్కలు సబ్సిడీపై తీసుకోవచ్చు. 15 రోజులుగా మొక్కలు అందిస్తున్నాము. గతంలో నరేగాలో పాఠశాలలు, ఆసుపత్రులు, గ్రామ పంచాయతీలకు ఉచితంగా ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ఎవరైనా సబ్సిడీపై తీసుకువెళ్ళొచ్చు.

ప్రశ్న : రోడ్ల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం ఎంత వరకు వచ్చింది.?
జిల్లాలో పది కిలోమీటర్ల పొడవున మొక్కలు నాటాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. అయితే ఎక్కడ నాటాలి అనేది ఇంకా నిర్ణయించలేదు. ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటి, పెంచడం జరుగుతుంది.

ప్రశ్న : జిల్లాలో సామాజిక వన విభాగానికి ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉందని అంటున్నారు?
జిల్లాలో అలాంటి సమస్య లేదు.. సరిపడ సిబ్బంది ఉన్నారు.

ప్రశ్న: నర్సరీల్లో మొక్కలు పెంచే అంశంలో ఉద్యోగులు నిధులు నొక్కేశారనే ఆరోపణలు గతంలో ఉన్నాయి. ఈసారి ఎలా అధిగమిస్తున్నారు?
నేను జిల్లాకు వచ్చి మూడేళ్లయింది. నేను వచ్చాక ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచడం, సమిష్టి కృషి, ఐక్య నిర్ణయాలు, బాధ్యతాయుత సేవలు పెంచడానికి కృషి చేస్తున్నాం. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. నేను వచ్చాక అవినీతి అక్రమాలకు తావు లేకుండా శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం.



టమోటాల కోసం బారులుతీరిన జనం

రైతుబజారులో సబ్సిడీపై టమోటాలు

బారులుతీరిన కొనుగోలుదారులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
సామాన్యుడి దగ్గర నుంచి సంపన్నుడి వరకూ ఏ కూర వండాలన్నా ఉల్లిపాయ, టమోట కచ్చితంగా ఉండాల్సిందే. ముఖ్యంగా మన తెలుగు వంటకాల్లో వీటికి అగ్రస్థానం ఉంది. అయితే ఉల్లిపాయ ధర అందుబాటులో ఉన్నప్పటికీ గత మూడు వారాలుగా టమోట ధర సామాన్యుడికి అందనంత దూరంలో ఉంది. చాలామంది ఇటీవల కాలంలో టమోటాలను కూరల్లో వాడటం మానేశారు అన్నది కూడా వాస్తవమే. రైతు బజారుల్లో కిలో రూ.వంద పలుకుతున్న టమోట ధర బయట మార్కెట్‌లో రూ.120 నుంచి రూ.140 వరకూ ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై టమోటాలను అందిస్తున్నామని ఆర్భాటంగా ప్రచారం చేసినప్పటికీ వాస్తవంగా సబ్సిడీపై టమోటాలు ఇస్తున్నది చాలా తక్కువ మొత్తంలోనే, తక్కువసార్లు మాత్రమే అని చెప్పొచ్చు. అయితే ఆదివారం ఏలూరులోని పత్తేబాద రైతు బజార్ లోను, వన్ టౌన్ రైతు బజార్ లోను సబ్సిడీపై కిలో 50 రూపాయలకే టమోటాలు అందించడంతో వినియోగదారులు వాటికోసం బారులు తీరుతున్నారు. పత్తేబాద రైతు బజారులో మూడు టన్నులు, వన్ టౌన్ రైతు బజారులో మూడు టన్నులు ఆదివారం వినియోగదారులకు అందించగా మధ్యాహ్నం 12 గంటలకే సబ్సిడీపై ఇచ్చే టమోటాలు అయిపోవడంతో చాలామంది వినియోగదారులు నిరాశగా వెనుతిరిగారు. సబ్సిడీ లేకుండా రైతు బజారులో కిలో టమోటాలు రూ.వందకు అమ్మడంతో అతి కొద్ది మంది మాత్రమే వాటిని కొనుగోలు చేయగా చాలామంది సబ్సిడీపై ఇచ్చిన టమోటాలు దొరక్క నిరాశతో వెళ్లిపోయారు. పైగా సబ్సిడీ టమోటాల కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో వేచి చూడాల్సి రావడం, టోకెన్ కోసం ఆధార్ కార్డు అడగటంతో చాలామంది నిరాశకు లోనయ్యారు. ఈ సందర్భంగా ఎస్టేట్ ఆఫీసర్ ఎం.సుధాకర్‌రావు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమోటాలను కొనుగోలు చేసి ప్రభుత్వం అందిస్తుందని, ఏలూరుతోపాటు నూజివీడు, కైకలూరుకు ఒక్కో టన్ను చొప్పున ఇచ్చారని తెలిపారు. ఈ నెలలో గతవారం సబ్సిడీపై టమోటాలు ఒకసారి ఇచ్చామని, ఇది రెండోసారి అని, మళ్లీ ఎప్పుడు వస్తాయో చెప్పలేమని తెలిపారు.

రామకృష్ణ మృతి బాధాకరం

కొయ్యలగూడెం: పెయింటర్ల వర్కర్ల సంక్షేమ సంఘం నామకులు చీదరాల రామకృష్ణ మృతి బాధాకరమని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు అన్నారు. మండలానికి చెందిన రామకృష్ణ ఇటీవల మృతిచెందారు. ఆదివారం జరిగిన ఆయన సంతాప సభకు రమణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు, నాయకులు మరడాని శ్రీనివాస్, ముదునూరి రామకృష్ణంరాజు, మారిన పేర్రాజు, బి.శ్యామ్,ఎస్.దుర్గారావు, పి.సత్యనారాయణ, రాజు, పి.శ్రీనివాస్, బుల్లి వెంకటరావు మాట్లాడారు.

స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

విస్సన్నపేట రోడ్డులో ఏర్పాటు చేసిన ఎంఐజి జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లో ప్లాట్లను కావాల్సిన వారు సిఆర్‌డిఎ ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఎల్‌ఏ వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం తెలిపారు. రూ.18 లక్షల లోపు ఆదాయం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 393 ప్లాట్లు ఉండగా 240 గజాల ప్లాట్లు 153, 200 గజాల ప్లాట్లు 121, 150 గజాల ప్లాట్లు 119 ఉన్నాయన్నారు. గజం రేటు రూ.8,500 ఉన్నట్లు తెలిపారు.

18 నుంచి రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - నిడమర్రు

ఈనెల 18, 19 తేదీలలో భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ నగరంలో జరుగుతున్నాయని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర రాంబాబు, నారపల్లి రమణారావు పేర్కొన్నారు. కాకినాడలోని యుటిఎఫ్ హోమ్ లో జరుగుతున్న క్లాస్‌లకు జిల్లా కమిటీ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

హిజ్రాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సామాన్యులకు ఇబ్బంది కలిగించే విధంగా హిజ్రాలు నడుచు కోరాదని సిఐ రాజేష్ సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక సిఐ కార్యాలయంలో హిజ్రాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్ మాట్లాడుతూ హిజ్రాలు గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలన్నారు. రహదారులపై వాహనాలను అడ్డగించి నగదు వసూళ్లు చేయరాదని తెలిపారు. ఇళ్ల వద్దకు వెళ్లి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేయడం నేరమని అన్నారు. పౌర హక్కులకు భంగం కలిగించడం మంచిది కాదన్నారు. దౌర్జన్యాలు చేస్తే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

పంచాయతీ కృష్ణారావుపేటలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు పూడి లక్ష్మణరావు బాల్యమిత్రులు ఆదివారం అతని కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రభుత్వోన్నత పాఠశాల 1995 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తెలాటం రామకృష్ణ, గిడుతూరి గంగాధర్, కుంజం అశోక్ కుమార్, జలీపల్లి రాజా, దేవబత్తుల నాగదేవి, పిల్లి రవికుమార్, మండపల్లి గాయత్రి, గేలం శ్రీనివాస్, నోరి సోమయాజులు, పొడియం సోమరాజు, ఎస్ శ్రీను, షేక్ ఇమామ్, సత్యవతి, బుల్లి వెంకయ్య, ప్రవీణ్, సత్యమూర్తి, సత్యనారాయణ మూర్తి, రత్నకుమారి, హంస్సిన్ పాల్గొన్నారు.

500 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఐవిఆర్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ గుడివాడ వారి ఆధ్వర్యంలో ముదినేపల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 500 మందికి వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో వైద్యులు ఈదుపుగంటి రాజ్యలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్‌లతో పాటు కార్డియాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఇఎన్‌టి డెంటిస్ట్, గైనకాలజీ, న్యూరో సర్జరీలకు చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరయ్యారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని నాగులగూడెంలో కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. లక్కవరం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కోడి పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి రూ.2,300 నగదు, ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఉద్యోగి మృతికి కారకుడైన డ్రైవర్ అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తుక్కులూరు వద్ద శనివారం రాత్రి టిప్పర్‌ను అతివేగంగా నడిపి ఉద్యోగి మృతికి కారణమైన లారీ డ్రైవర్ పావులూరి శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ తెలిపారు. డ్రైవర్ శ్రీనివాసరావు అతిగా మద్యం సేవించి వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందన్నారు.

చంపుతామని బెదిరించిన ముగ్గురిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యక్తిని చంపుతామని బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలం కేంద్రమైన టి.నరసాపురం గ్రామానికి చెందిన నార్లపాటి వెంకట దుర్గారావుకు స్థానిక సినిమా హాలు ఎదురుగా 93 సెంట్ల భూమి ఉందన్నారు. ఆ భూమిలో నుంచి దారి ఇవ్వమని అదే గ్రామానికి చెందిన బొడ్డపాటి వీరయ్య, బొడ్డపాటి దుర్గారావు, బొడ్డపాటి పుల్లారావులు గత కొంతకాలంగా గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరు ముగ్గురు ఈనెల 13న ఉదయం వెంకట దుర్గారావు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి పశువుల దొడ్డి తడికలను పీకివేసి, 2 సిమెంటు స్థంబాలను విరగగొట్టి అడ్డం వస్తే చంపేస్తానని బెదిరించినట్లు దుర్గారావు అన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భర్త మందలించాడని చీమల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మండలంలోని కామయ్యపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహిళను తన భర్త కోపంలో మందలించాడని మనస్థాపం చెంది ఇంట్లో వున్న చీమల మందును మాజా బాటిల్‌లో కలుపుకొని తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కామయ్య పాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108లో జంగారెడ్డి గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు..

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - ముదినేపల్లి

యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షణ్ముఖసాయి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వైవాకకు చెందిన బూసి కావ్య అనే యువతి కృష్ణాజిల్లా బంటుమిల్లిలోని ఓదుకాణంలో పని చేస్తుంది. ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లిన కావ్య ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్ల వద్ద, స్నేహితులు వద్ద ఎంత గాలించిన అచూకీ తెలీలేదు. దీంతో యువతి తండ్రి బూసి సంజీవయ్య తన కుమార్తె కనబడడంలేదంటూ ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

ముదినేపల్లి : వరకట్న వేధింపులపై మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షణ్ముఖసాయి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిరుగుకోటకు చెందిన లక్ష్మీతిరుమలదేవికి ఐదేళ్ల క్రితం గుడివాడ ధనియాలపేటకు చెందిన చలపాక గంగాధరరావుతో వివాహమైంది. గత కొంతకాలంగా భర్త తన భార్యను అధిక కట్నం తేవాలంటూ నిత్యం వేధింపసాగాడు. భార్యను అధిక కట్నం కోసం శారీరకంగా, మానసికంగా భర్త గంగాధరరావు నిత్యం ఇబ్బందులకు గురి చేస్తుండడంతో విసుగు చెందిన ఆమె ఆదివారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యథేచ్ఛగా తమ్మిలేరులో ఇసుక తవ్వకాలు

చోద్యం చూస్తున్న అధికారులు

రాత్రి వేళల్లో జోరుగా ఇసుక రవాణా

ముసునూరు కేంద్రంగా వివిధ పట్టణాలకు,

ఇతర జిల్లాలకు తరలింపు

పట్టించుకోని అధికారులు



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే, యల్లాపురం, వలసపల్లి, గుళ్లపూడి, లోపూడి సరిహద్దు గ్రామాల నుంచి అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. పోలీసులు అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడి వల్ల ఉన్నతాధికారులు వాల్టా చట్టం ఉపయోగించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. బలివే, ఎల్లాపురం, వలసపల్లి, గుళ్లపూడి, లోపూడి తమ్మిలేరుకు సరిహద్దు గ్రామాలు కావడంతో రెండు పక్కలా జాతీయ రహదార్లు అందుబాటులో వుండటంతో అక్రమ ఇసుక రవాణాకు మంచి అవకాశంగా మారింది. తమ్మిలేరు సరిహద్దు గ్రామాల్లోని ప్రతీఇంటిలో చిన్న ఆటో మొదలు టాటా ఏసిలు, ట్రాక్టర్లు కొనుగోలు చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. అతి తక్కువలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగుట్టుకోవడం చూస్తున్నాం.. గత కొన్ని రోజుల క్రితం అక్రమ ఇసుక రవాణాలో కలిసిన స్నేహం చివరికి హత్యలకు దారితీసి తమ్మిలేరులోనే పూడ్చేసిన సంఘటనలు కలవు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తే కొంతమంది ప్రాణాలను కాపాడిన వారు అవుతారని తమ్మిలేరు పరిసర ప్రాంతాల ప్రజలు కోరుకుంటున్నారు. మరికొందరు ఎడ్లబండ్ల ద్వారా తమ ఇండ్ల వద్ద, తోటల్లో పెద్ద పెద్ద గుట్టలుగా ఇసుక ఉంచుతున్నారు. ఆఇసుకను అధిక ధర వచ్చినప్పుడు ట్రాక్టర్లు వారికి విక్రయిస్తూ సోమ్ము చేసుకుంటున్నారు. మండలస్థాయి అధికారులు నామమాత్రపు దాడులు చేస్తున్నారా? లేదా రాజకీయ ఒత్తిడిలతో వాహనదారులను వాల్టా చట్టం ఉపయోగించి గట్టి చర్యలు తీసుకోలేకపోతున్నారా? అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లో మాత్రం రోజుకొకటి లేదా వారానికొకటి చొప్పున అక్రమ ఇసుక రవాణా కేసు నమోదు కావడం గమనార్హం. అధికారులు మాత్రం వాహనాలను సీజ్ చేయడం, రాజకీయ నాయకుల ఒత్తిడిలతో యథావిధిగా మళ్లీ ఇసుకను అక్రమంగా రవాణా చేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అక్రమ ఇసుక రవాణాతో వెళ్తూ మృతి చెందిన యువకుడు

నూకాలమ్మ ఆలయాన్ని సందర్శించిన పాడుతా తీయగా విజేత ధీరజ్

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయాన్ని కీర్తిశేషులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం నిర్వహించిన పాడుతా తీయగా 2018 విజేత, యువ గాయకుడు ధీరజ్ ఆదివారం సందర్శించారు. నర్సిపట్నంకు చెందిన దొంతంశెట్టి రాజేష్, రాణి దంపతుల కుమారుడు దొంతంశెట్టి ధీరజ్ స్థానిక శ్రీనూకాంబికా అంజనీసాయి స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మహంకాళి రాజాతో నూకాలమ్మ ఆలయానికి విచ్చేశారు. ధీరజ్ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ స్వాగతం పలికారు. అనంతరం యువగాయకుడు ధీరజ్ పలు పాటలు పాడి అలరించారు. ఈ సందర్భంగా ధీరజ్ మాట్లాడుతూ 2022లో మాటీవీ సూపర్ సింగర్ పోటీల్లో జూనియర్ విభాగంలో ఫైనలిస్ట్‌గా నిలవడంతో పాటు ఎస్‌విబిసి చానెల్‌లో అన్నమయ్య పాటకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారింగుల రామకృష్ణ, రొంగల నాగేశ్వరావు, చిట్లూరి సర్వేశ్వరరావు, చింతకాయల అచ్చిరాజు, రొంగల సత్యనారాయణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

4 నుంచి ఫొటోగ్రఫీ వర్క్‌షాప్

ఏలూరు: ఫోటోగ్రాఫర్స్ అంతా ఐక్యంగా ఫోటోగ్రఫీ వర్క్‌షాప్‌ను వినియోగించుకుని టెక్నాలజీ అందుకోవడానికి ప్రతి ఫోటోగ్రాఫర్ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆత్మీయ కమిటీ సభ్యులు సాగర్‌బాబు, శ్యాంకుమార్ తెలిపారు. రాజమండ్రిలో ఆగస్టు 4, 5, 6 తేదీలలో జరిగే ఫోటోగ్రఫీ వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీలకు చెందిన ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మిక్సింగ్, ప్రింటింగ్ సంబంధించిన పరికరాలు అందుబాటు ధరల్లో ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఆధునికత వినియోగం ద్వారా పల్లెల్లో ఉన్న ఫోటోగ్రాఫర్లలో ప్రతిభ వెలికి తీయవచ్చని సాగర్ బాబు తెలిపారు. ఫోటోగ్రఫీలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల ద్వారా పల్లెల్లో సైతం ఫోటోగ్రాఫర్లు అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మద్దాల శేఖర్, ఎం.రవి శంకర్, షేక్ నయీమ్, స్థానిక ఫోటోగ్రాఫర్లు భాను, వీరమల్ల మధు, ఆనంద్, బద్రి, అమరేశ్వరరావు, రఘు, సౌజన్ పాల్గొన్నారు.

రాజులపాటి శోధనరావుకు ఎంఎల్‌ఎ డిఎన్ఆర్ పరామర్శ

మండవల్లి: రోడ్డు ప్రమాదం సంభవించి కాళ్ళు, చేతులు విరిగిపోవడం చాలా బాధాకరమైన విషయమని కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. మండలంలోని లింగాల శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ రాజులపాటి శోధనరావు ప్రమాదవశాత్తు రహదారి ప్రమాదంలో కుడికాలు విరిగిపోవడంతో ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్ద చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న ఎంఎల్‌ఎ ఆదివారం యశోదనరావు ఇంటికి చేరుకుని పలకరించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కానుకల్లు నుంచి లింగాల వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి జాతీయ రహదారిపై పడడంతో కుడికాలు విరిగిపోయిందని ఎంఎల్‌ఎకి తెలిపాడు.

మండలంలోని లింగాల సొసైటీ అధ్యక్షులు గరికపాటి రామ్మోహన్ రావు మాతృమూర్తి గరికపాటి రాధమ్మ ఆదివారం మృతి చెందారు. మండవల్లి ఎంఎల్‌ఎ జయ మంగళ వెంకటరమణ సయ్యపరాజు గురురాజు, ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు రాధమ్మ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రతిఒక్కరికీ పిఎంజెజెబివై, ఎస్‌బివై ఉండాలి

ప్రజాశక్తి - మండవల్లి



నామినీలకు చెక్కులను అందిస్తున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలు దేశంలోనే నెంబర్‌వన్ పథకాలని, వాటి ద్వారా పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు తెలిపారు. గన్నవరం గ్రామంలో పిఎంజెజెబివై పథకంలో చేరిన బొడ్డు కోటేశ్వరరావు, కొమ్మనపల్లి లక్ష్మీ బాయి ఇటీవల మృతి చెందడంతో మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా వచ్చిన రూ.రెండు లక్షల చెక్కులను నామినీలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ప్రజలు అవగాహన లేకపోవడం వల్ల ఈ పథకాలలో చేరడం లేదని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కర్ రావు మాట్లాడుతూ 18 నుంచి 70 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తులు సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లించి పిఎంఎస్‌బివై పథకంలో చేరవచ్చన్నారు. ప్రమాదవశాస్తూ మరణిస్తే రూ.2 లక్షలు బీమా ద్వారా ఆ కుటుంబానికి అందుతాయని అన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు వారు సంవత్సరానికి పిఎంజెజెబివై పథకంలో చేరి రూ.436 చెల్లించి నమోదు చేసుకుంటే సహజ మరణానికి రూ.రెండు లక్షలు నామినీకి అందుతాయన్నారు. రెండు పాలసీలు కలిపి సంవత్సరానికి కేవలం రూ.456 చెల్లిస్తే చాలని, ప్రమాదం సంభవించి కుటుంబ పెద్ద కోల్పోతే బీమా ద్వారా వచ్చే సొమ్ము ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాను కలిగిస్తుందని అన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం నామినీయులైన బొడ్డు కరుణ, కొమనపల్లి ఎస్‌ఐకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ క్లైములను బాధితులకు త్వరితగతిన అందిస్తున్న మేనేజర్ దుర్గారావును ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావును దుశాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుడివాడ తంబు స్వామి, కొర్లపాడు మాజీ సర్పంచి వెంకటేశ్వరరావు, కైకలూరు ఎల్ఐసి ఎబిఎన్ చరణ్, బ్యాంకు మిత్రాలు జాస్ మిన్, ఎఎన్ఎం పద్మ సాయి, రోజా లక్ష్మీ, ప్రసన్న శివ పార్వతి, సునీత పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవతా ఆశయాలకు అనుగుణంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఉమ్మడి జిల్లాల ఛైర్మన్ రామిశెట్టి గంగాధర రావు మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులను కోరారు. భీమడోలులో సంస్థకు చెందిన ఒకటి, రెండు, మూడు, నాలుగు రీజియన్ల పరిధిలోని మండలాల నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులకు అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. పరిశీలకులుగా జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ సంస్థకు చెందిన మండలాల స్థాయి నూతన కమిటీల కార్యవర్గ సభ్యులు సంస్థాగత నిర్మాణం, పరిపాలన తీరు, ఆర్థిక వ్యవహారాలు, బ్యాంకు లావాదేవీలు, ఆడిటింగ్ ఇతర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విరాళాల సేకరణ, ఇతర అంశాలలో సంస్థ నిర్ణయాలను అమలు చేయాలన్నారు. కమిటీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు జిల్లా కమిటీకి తెలియజేయాలన్నారు. బహుళ ప్రయోజనకారిగా మారిన సంస్థ డైరెక్టరీ తయారీకి అవసరమైన సమాచారాన్ని జిల్లా కమిటీకి సకాలంలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంస్థ శాంతి రథాల విభాగం ఛైర్మన్ అప్పక రాంబాబు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

ఆర్గానిక్ కెమిస్ట్రీ పిహెచ్‌డిలో బాదంపూడికి చెందిన జ్యోతిర్లతకు సీటు

ప్రజాశక్తి - ఉంగుటూరు



జీవితంలో మనం ఎన్నో కలలు కంటూ ఉంటాం.. అయితే ఆ కలలు కనడం కష్టం కాకపోయినా, ఆ కలలను నెరవేర్చుకోవడం మాత్రం కత్తి మీద సాములంటిదని అనడంలో ఎటువంటి సందేహం లేదు. వాటిని నెరవేర్చుకున్నారు ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన యువతి.. జాతీయ రహదారికి పక్కనే ఉన్న బాదంపూడి అనే ఒక చిన్న గ్రామం ఆమెది. ఆ గ్రామంలోని శ్రీనివాస్ రావు, కృష్ణ వేణి దంపతుల పెద్ద కుమార్తె కాసు జ్యోతిర్లత వెంకట నాగేశ్వరి. ఈమె భారతదేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ప్రకారం ఉత్తమ యూనివర్సిటీగా ఉన్న బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ సైన్సెస్‌లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి చేసేందుకు సీటు సాధించారు. ఈనెల 18న ఇనిస్టిట్యూట్లో చేరుబోతున్నారు.

ఎల్‌కెజి నుంచి ఐదో తరగతి వరకూ బాదంపూడిలోని విజయవాణి స్కూల్లోనే చదువుకుంది. ఆరు నుంచి పదవ తరగతి వరకూ తాడేపల్లిగూడెంలోని మహతి స్కూల్లో చదువుకున్న జ్యోతిర్లత పదవ తరగతిలో 9.8 గ్రేడ్ పాయింట్లు సాధించి రాష్ట్రంలోనే రెండో ర్యాంకు పొందింది. బాదంపూడి నుంచి తాడేపల్లిగూడెం వరకూ ఆర్‌టిసి బస్సులో వెళ్లి చదువుకోవడం విశేషం.

ఇంటర్మీడియట్‌లో ఆదిత్య కాలేజీలో చదివి 987 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌తో పాటు రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించారు. అనంతరం జెఇఇ మెయిన్స్ ద్వారా ఎన్ఐటి దుర్గాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సి కెమిస్ట్రీలో సీటు సాధించింది. స్టేట్ 1శాతం విద్యార్థులకు వచ్చే సైన్సు మెరిట్ స్టూడెంట్‌గా ఇన్స్పైర్ స్కాలర్ షిప్‌ని జ్యోతిర్లత ఐదు సంవత్సరాలు పొందారు. జ్యోతిర్లత ముంబై ఐఐటీలో ఇంటెర్న్‌షిప్ చేసి ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, బెంగుళూరు వారి నుంచి సర్టిఫికెట్ పొందారు. దుర్గాపూర్ ఎన్ఐటిలో ఫైనల్ ఇయర్ ప్రాజెక్టులో కెమిస్ట్రీ విభాగంలో ఫస్ట్ వచ్చి కాలేజీలో బెస్ట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. యూనివర్సిటీ ఫస్ట్‌తో చదువు పూర్తి చేసి బంగారు పతకం పొందారు. ఇండియాలోని అత్యున్నతమైన యూనివర్సిటీలలో ప్రథమ స్థానంలో ఉన్న బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి చేసేందుకు సీటు సంపాదించారు.

ఈ యూనివర్సిటీలో పిహెచ్‌డి సీటు సాధించాలంటే అప్లికేషన్ పెట్టిన తర్వాత మొదట ఇంటర్వ్యూకి షార్ట్ లిస్ట్ అవ్వాలి. కాల్ లెటర్ వచ్చిన తర్వాత ఇంటర్వ్యూకి వెళ్లి రెండు రౌండ్లు ఇంటర్వ్యూలో విజయం సాధించాలి, అదనంగా గేట్‌లో మంచి స్కోరు ఉండాలి లేదా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ ద్వారా జెఆర్ఎఫ్ కలిగి ఉండాలి. లేదంటే సిఎఫ్‌టిఐలో మెరిట్‌లో ఉండాలి లేదా ఇన్స్పైర్ స్కాలర్ అయినా అయి ఉండాలి. అయితే జ్యోతిర్లత ఈ నాలుగింటిలో క్వాలిఫై అయి ఉండటం గమనార్హం.

ప్రస్తుతం సిఎఫ్‌టిఐ ద్వారా సెలెక్ట్ కాబడింది. ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి కోసం దేశ వ్యాప్తంగా వందలాది మంది అప్లై చేస్తే 11 మందికి మాత్రమే సీట్లు వచ్చాయి. వారిలో ఒకరు ఈమె కావడం విశేషం.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి చదివే అభ్యర్థికి ఆర్గానిక్ కెమిస్ట్రీ రంగంలో విస్తృతమైన జ్ఞానం, పరిశోధన అనుభవం అవసరం.. ఇక్కడ పిహెచ్‌డి చేయడం వలన మంచి కెరీర్ అవకాశాలు ఉన్నాయని, దేశానికి అవసరమైన సేవలు అందించే ప్రయత్నం చేస్తానని ఆమె ప్రజాశక్తికి వివరించారు.

రీసెర్చ్ సైంటిస్ట్ పిహెచ్‌డి ఆర్గానిక్ కెమిస్ట్రీలో అభ్యర్థులు అకాడమియా, ప్రభుత్వ ప్రయోగశాలలు లేదా ప్రైవేట్ పరిశ్రమలలో పరిశోధనా శాస్త్రవేత్తలుగా మారతారన్నారు. వారు ఆర్గానిక్ కెమిస్ట్రీలో అత్యాధునిక పరిశోధనలు నిర్వహిస్తారని, కొత్త పద్ధతులను అభివృద్ధి చేస్తారని, సేంద్రీయ సమ్మేళనాలను రూపొందించడం, సంశ్లేషణ చేయడం, సేంద్రీయ ప్రతిచర్యల విధానాలను అధ్యయనం చేస్తారని జ్యోతిర్లత తెలిపారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో అభ్యర్థులు ఈరంగం పరిశోధన, బోధన, పరిశ్రమ, ఆవిష్కరణల కోసం విస్తృత అవకాశాలను పొందుతున్నారన్నారు. సహజాయోగా ధ్యానం చేయడం ద్వారా తనకు అనేక ప్రయోజనాలు చేకూరాయని, తన తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అవకాశం దొరికిందని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. జ్యోతిర్లత పిహెచ్‌డి సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



బెంగుళూరు యూనివర్శిటీ..

రోడ్డు ప్రమాదంలో కలెక్టరేట్ ఉద్యోగి మృతి

నూజివీడు రూరల్: టిప్పర్ ఢీకొని ఏలూరు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ సాయినాథ్(35) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూజివీడు పట్టణానికి చెందిన సాయినాథ్ ఏలూరు కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం విధులకు హాజరైన ఆయన రాత్రికి పనులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి బయలుదేరాడు. తుక్కులూరు వద్దకు రాగానే ఎదురుగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయినాథ్ అక్కడికక్కడే మృతిచెందారు.

మూడు నెలల క్రితమే ఉద్యోగోన్నతి

సాయినాథ్ ఇటీవల వరకూ నూజివీడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. మూడు నెలల క్రితం కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందడంతో అక్కడకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఇంటి వద్ద నుంచే నిత్యం ఏలూరు వెళ్లి వస్తున్నారు. ఈ తరుణంలో ఈ ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

టిప్పర్ బీభత్సం

సాయినాథ్‌ను ఢీకొట్టిన లారీ బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చిన టిప్పర్ అతన్ని ఢీకొట్టిన తర్వాత అక్కడితో ఆగకుండా పక్కన వెళున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. టిప్పర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు వెంబడించి గొల్లపల్లి వద్ద అడ్డుకున్నారు.

పలువురు పరామర్శ

సాయినాథ్ మృతదేహాన్ని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, తహశీల్దార్ ఎల్లారావు, రెవెన్యూ ఉద్యోగులు సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలిపారు.

ఘనంగా ఎంపిపి పుట్టినరోజు వేడుక

ముదినేపల్లి: ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ముదినేపల్లిలో అట్టహాసంగా పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కార్యాలయానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచి, శ్రీవెంకటేశ్వరస్వామి వారి దర్శనార్థం కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్లిన ఎంపిపి సత్యనారాయణకు పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎం.ఏసుబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి రాచూరి రాధా పాల్గొన్నారు.

చేతిపంపు ఏర్పాటు ..

ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ జన్మదినం సందర్భంగా మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్ష ప్రజలు దాహార్తిని తీర్చేందుకు తన సొంత ఖర్చులతో చేతి పంపును ఏర్పాటు చేశారు. స్థానిక కైకలూరు రోడ్డులోని హైస్కూల్ సమీపంలో చేతిపంపు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ చేతిపంపు ఏర్పాటు వల్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు, రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు దాహార్తిని తీరుస్తుంది.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

చింతలపూడి: బాబు జగజ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని చింతలపూడి సొసైటీ ఛైర్మన్ ఆతుకురు సుబ్బారావు అన్నారు. చింతలపూడి మండలం కాంతంపాలెం గ్రామంలో బాబు జగజ్జీవన్ రావు విగ్రహాన్ని కాంతం పాలెం మాదిగ యువసేన యూత్ ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శేఖర్ మాదిగ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అమలు పరచడంలో బాబు జగజ్జీవన్ రావు ముఖ్యపాత్ర వహించారని ఆయన అన్నారు. కేంద్ర మంత్రిగా, దళిత జాతి అభివృద్ధికి కృషి చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కలపాల సురేష్ మాదిగ, ముప్పిడి శామ్యూల్, ఎస్ఐ ముప్పిడి జాషువా, కాంతంపాలెం గ్రామస్తులు నేమకూరి సర్వేశ్వరరావు, తనకి సురేష్, దుక్కుపాటి చిన్న, దోనేటి పెద్ద మారేష్ యూత్ సభ్యులు, తాళ్లూరు ఏసేపు, దోనేటి శ్రీనివాసరావు, దుక్కపాటి సందీప్, హరీష్, నితిన్ పాల్గొన్నారు.

పోలవరంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ

బుట్టాయగూడెం: మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సొంబాబు అధ్యక్షతన జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వేంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పారేపల్లి రామారావు హాజరయ్యారు. ఈ శిక్షణా కార్యక్రమంలో బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలకు ఆర్టిఎస్, మన టిడిపి యాప్, ఓటర్ వెరిఫికేషన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం బొరగం శ్రీనివాసులు, జయవరపు శ్రీరామ్మూర్తి, శీలం వేంకటేశ్వరరావు, పారేపల్లి రామారావులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావటంతో దొంగ ఓట్లు చేర్చి గెలవాలని కుట్ర చేస్తున్నారని అందరూ కూడా ఓటర్ వెరిఫికేషన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యంత్రప్రగడ శ్రీనివాస్, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

9న చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ఏలూరు అర్బన్: వచ్చేనెల తొమ్మిదో తేదీన విజయవాడలో నిర్వహించే శ్రామిక గర్జన, మహాపడావ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావుల రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ అధికారం చేపట్టిన తరువాత ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారిన మోడీ సర్కారును సాగనంపడానికి వచ్చేనెల తొమ్మిదో తేదీన క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ మోడీ... సేవ్ ఇండియా అనే నినాదంతో విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.